మీడియా కమ్యూకేషన్ డైరెక్టర్‌గా కర్రి శ్రీరాం

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మీడియా కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జర్నలిస్టు కర్రి శ్రీరాంను నియమిస్తు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన రెండేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఈవో స్పెషల్ సెక్రటరీ ఎం హనుమంతరావు స్పష్టంచేశారు.

ఓవర్ డ్యూటీ.. ఓవర్ లోడ్!

- **అయోమయంలో టీజీఆర్టీసీ సిబ్బంది**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో డ్రైవర్ డ్యూటీ 8 గంటలే.. సిబ్బంది కొరత కారణంగా ఒక్కొక్కరు సుమారు 14 గంటల పాటు పనిచేస్తున్నారు. శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నారు. ఇదే దశలో ముందుచూపు లేకుండా రాష్ట్ర సర్కారు అమలుచేసిన మహాలక్ష్మి పథకంతో బస్సులు ఓవర్‌లోడ్‌తో నడపాల్సి వస్తున్నది. ఇటీవల ప్రయాణికుల ఓవర్‌లోడ్ కారణంగా నడుస్తున్న బస్సుల చక్రాలు, పరికరాలు ఊడిపోయాయి. దీంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. 50 మంది ఎక్కాల్సిన కరీంనగర్ డిపో బస్సులో 170 మంది ఎక్కారు. ఓవర్‌లోడ్ కారణంగా బస్సు వెనుకాల రెండు టైర్లు ఊడిపోయాయి. ఈ సమయంలో బస్సులో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. నారాయణపేట జిల్లా ఉట్కూరులో బస్సు రన్నింగ్‌లో ఉండగా బస్సు పార్టులు ఊడిపోయి రోడ్డుపైన పడ్డాయి. ఆయా ఘటనల్లో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే.. తలుచుకుంటేనే ఒళ్లుగగుర్పొడుస్తున్నది. ఈ రెండు చోట్లే కాకుండా మరికొన్ని చోట్ల ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆర్టీసీలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 వరకు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఉన్న డ్రైవర్లపై పనిఒత్తిడి పెరుగుతున్నది. రద్దీకి అనుగుణంగా 3 వేల కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలని కార్మికుల జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, ప్రతినిధి థామస్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే కొంత ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు.

పొచ్చర వాగులో ముగ్గురు సోదరుల మృతి

ఆదిలాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : చేపలవేటకు వెళ్లిన మహారాష్ట్రకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. మహారాష్ట్ర నాందెడ్ జిల్లా నవీ అబాదికి చెందిన నాగుల్ వాడే విజయ్ (28), నాగుల్ వాడే ఆకాశ్ (26), నాగుల్ వాడే అక్షయ్ (24) తాంసి మండలం బండల్‌నాగాపూర్‌లో వారి బంధువు శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. మంగళవారం ఈ ముగ్గురు చేపలవేట కోసం ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర వాగులోకి వెళ్లారు. వాగులో దిగి చీరతో చేపలు పడుతుండగా లోతు తెలియకపోవడంతో అక్షయ్ వాగులో మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ఆకాశ్, విజయ్ ప్రయత్నించగా వారు సైతం నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 5 గంటల పాటు శ్రమించి ముగ్గురు యువకుల మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

అధికారిక నిర్ణయమా? అనధికార నిర్లక్ష్యమా?

- **రాజముద్రలో కళాతోరణం తొలగింపుపై కేటీఆర్ ఫైర్**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 'ఎక్స్'లో పోస్ట్**

వరంగల్, ఆగస్టు 27: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో కాకతీయ కళాతోరణం లేకుండా గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'ఇది అధికార నిర్ణయమా? లేక అనధికార నిర్లక్ష్యమా? తెలంగాణలో అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా సీఎస్ గారు?' అంటూ తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తెలంగాణ అస్థిత్వ చిహ్నాలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లతో వెకిలి పనులు ఏంటి? కొత్త చిహ్నం ఎవరు? ఎప్పుడు అమోదించారు? ఒకవేళ అమోదించకపోతే అధికారులు దీనిని ఎందుకు వాడారు? దీనికి కారకులెవరో కనుక్కొని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ముందు అధికారులు రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫొటోను ఆయన పోస్ట్ చేశారు.

రాజముద్రలో కళాతోరణం తొలగింపుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ అకౌంట్‌లో చేసిన పోస్ట్

పొరపాటును గుర్తించిన బల్దియా

- **'తప్పుడు రాజముద్ర' ఫ్లెక్సీ తొలగింపు**
- **'అధికారిక రాజముద్ర' ఫ్లెక్సీ ఏర్పాటు**

వరంగల్, ఆగస్టు 27: వరంగల్ బల్దియా అధికారులు తప్పును గుర్తించారు. రెండు రోజుల క్రితం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ముందు ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌లైన్ పేరిట అధికారికంగా ప్రకటించని రాష్ట్ర రాజముద్రతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చర్యలు తీసుకుంటున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా టౌన్‌ప్లానింగ్ విభాగం ఉద్యోగులకు మెమో జారీ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజముద్రను తప్పుగా ముద్రించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన 'ఎక్స్' అకౌంట్‌లో ఫ్లెక్సీతో సహా పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బల్దియా కార్యాలయం ముందు రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్‌తో కూడిన కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

అధికారిక రాజముద్రతో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

17 నుంచి 'ప్రజా పాలన'

- **మరో 10 రోజులు దరఖాస్తుల స్వీకరణ**
- **రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా**
- **గోషామహల్‌లో కొత్త ఉస్మానియా దవాఖాన**
- **ఏడాదిలోగా 15 నర్సింగ్ కాలేజీలకు భవనాలు**
- **సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి వివిధ శాఖలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు సంబంధం ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా ప్రతి కుటుంబం నుంచి వివరాలను సేకరిస్తామని తెలిపారు. ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం అందించేందుకు ఇకపై హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందన్నారు. హెల్త్ ప్రొఫైల్‌కు వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీకి కార్యాచరణ రూపొందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ దవాఖానల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేస్తామని సీఎం హెచ్చరించారు. డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు కలెక్టర్లు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

స్పీడ్.. పెంచండి

స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా దవాఖాన కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి చర్చించారు. హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని సీఎం ఆదేశించారు. గోషా మహల్‌లోని పోలీస్ విభాగం అధ్వర్యంలో ఉన్న స్థలాన్ని వెంటనే వైద్యారోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. పేట్లబుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ అర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ చుట్టూ ఉన్న స్థలాన్ని పరిశీలించాలని, గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అక్కడికి తరలించాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో దవాఖానకు డిజైన్లను తయారు చేయించాలని కోరారు. రాబోయే 50 ఏండ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త దవాఖాన నిర్మాణ డిజైన్లు ఉండాలని ఆదేశించారు. కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని, దవాఖాన చుట్టూ నలువైపులా రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. అన్ని విభాగాలతోపాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలన్నారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించే దవాఖానల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలన్నారు. సమీక్షలో సీఎస్ శాంతి కుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను మార్చడంపై హైకోర్టులో విచారణ

స్థానికతపై నేడూ వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను సవరించి, రూల్ 3ఏ సెక్షన్‌ను చేర్చుతూ ప్రభుత్వం గత నెల 19న జారీచేసిన జీవో 33కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. అడ్మిషన్లకు విద్యార్థుల స్థానికతను రాజ్యాంగం ప్రకారంగా నిర్ణయించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. నీట్ నోటిఫికేషన్ జారీ అయ్యాక స్థానికతను మార్చడం చెల్లదని పేర్కొన్నారు. స్థానికత వివాదంపై నిరుడు హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా జీవో 33 ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వల్ల స్థానికులకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనానికి వివరించారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉద్యోగులకు బదిలీలు తప్పని సరని, అలాంటివారి పిల్లలకు స్థానికతను నిరాకరించడం చెల్లదనే తీర్పును పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. అలాంటి అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారిని స్థానిక కోటా కిందనే పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ఈ వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

ఒద్దిరాజు సోదరులు గొప్ప కవులు

- **వారి విగ్రహాలను ట్యాంకు బండ్‌పై పెట్టడానికి కృషిచేస్తా**
- **టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్**

మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్

ఇనుగుర్తి, ఆగస్టు 27: ఒద్దిరాజు సోదరులు సీతారాంచందర్‌రావు, రాఘవ రంగారావు తెనుగు పత్రికను స్థాపించి కవులు, రచయితలుగా తెలంగాణ రాష్ట్రంలో ఖ్యాతి గడించారని టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ పేర్కొన్నారు. తెనుగు పత్రికను స్థాపించి 102 ఏండ్లు కావడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఒద్దిరాజు సుభాష్ ఆధ్వర్యంలో తెనుగు దినపత్రిక శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ.. సుభాష్ ఆధ్వర్యంలో తెనుగు దినపత్రిక శతాబ్ది వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. బహుభాషా కోవిదుల విగ్రహాలను ట్యాంక్‌బండ్ మీద పెట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. సంగీతం, సాహిత్యంతో పాటు వైద్యవిద్యను సైతం నేర్చుకొని స్వయంగా శస్త్రచికిత్సలు చేశారంటే.. వారు అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందారని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఇనుగుర్తికే పరిమితం కాకుండా హైదరాబాద్ వేదికగా జరగాలని ఆకాంక్షించారు.

ఏజెన్సీ బంద్ విజయవంతం

ఆదివాసీల కోసం ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ వేయాలని, ఐటీడీ ఏలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో 3ను కొన-సాగించాలనే డిమాండ్లతో ఆదివాసీ సంఘం తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని మండలాల్లో వ్యాపారులు దుకాణాలు మూసి బంద్‌కు సహకరించారు. ఆదిలాబాద్ బస్టాండ్ ఎదుట ఆదివాసీ నాయకులు రాస్తారోకో చేశారు. —ఆదిలాబాద్

మహబూబాబాద్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఎమ్మెల్యే సొంతూరిలోనే పవర్ కట్

- **కరెంట్ పోయిందని తండావాసులు ఫోన్ చేస్తుండ్రు**
- **అధికారులు పనిచేయకపోతే సస్పెండ్ చేస్తా**
- **మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ హెచ్చరిక**

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 27: 'మా సొంతూర్లోనే విద్యుత్తు సమస్య తీవ్రంగా వేధిస్తున్నది. మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కరెంట్ తీస్తుండ్రు. దీనికి అసలు సమస్య ఏంటో తెలియడం లేదు' అని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విద్యుత్తు అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరును తీసుకొస్తున్నారని, వారు తీరు మార్చుకొని విధులు నిర్వహించాలని, లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. రాత్రి పూట తండాల్లో కరెంట్ పోతే స్థానికంగా ఉన్న లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలు, డీఈలు తమ ఫోన్లను ఎత్తకపోవడం వల్ల ప్రజలు కరెంట్ పోయిందని స్వయంగా తనకే ఫోన్ చేసి చెప్తున్నారని ఫైర్ అయ్యారు. గ్రామాల్లో లూజ్ వైర్లను లాగి ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

పేపర్‌పైనే ఫీవర్ సర్వే!

- **వైద్యారోగ్యశాఖ కాకిలెక్కలపై తీవ్ర విమర్శలు**
- **34 రోజుల్లో 4.4 కోట్ల మందికి స్క్రీనింగ్**
- **1.42 కోట్ల కుటుంబాలను విజిట్ చేసినట్టు లెక్కలు**
- **రాష్ట్ర జనాభాను మించి ఎలా సర్వే చేశారని ప్రశ్నలు**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం వీడటం లేదు. పైగా కాకిలెక్కలతో ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నది. సీజనల్ వ్యాధులపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సోమవారం విడుదల చేసిన గణాంకాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డెంగ్యూ కేసులను, మరణాలను దాచిపెడుతున్నారని ఆరోపణలు ఉండగా.. తాజా గణాంకాలతో ఫీవర్ సర్వేపైనా అనుమానాలు మొదలయ్యాయి. ఇది ఫీవర్ సర్వే కాదని.. 'పేపర్' సర్వే అని వైద్యనిపుణులు, రాజకీయ పక్షాలు, నెటిజన్ల నుంచి విమర్శలు మొదలయ్యాయి. డీపీహెచ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెల 23వ తేదీన జ్వర సర్వే ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ నాటికి 1,42,78,723 ఇండ్లను సందర్శించి, 4,40,06,799 మందిని సర్వేచేశారు. ఇందులో 2,65,324 మంది జ్వరబాధితులను గుర్తించారు.

జనాభాను మించి సర్వే ?

రాష్ట్ర జనాభా దాదాపు 4 కోట్లు. మరి వైద్య సిబ్బంది జనాభాను మించి ఎలా స్క్రీనింగ్ చేశారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. జ్వర సర్వే ప్రారంభమయినప్పటి నుంచి 34రోజుల్లోనే 4.40కోట్ల మందికి స్క్రీనింగ్ చేశామని చెప్తున్నారు. ఈ లెక్కన రోజుకు 13.75 లక్షల మందికి స్క్రీనింగ్ చేసినట్టని.. ఇది సాధ్యమేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక 1.42 ఇండ్లను సర్వే చేశామని చెప్పడంపైనా పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో దాదాపు కోటి కుటుంబాలు ఉన్నాయని.. రోజుకు 4.20 లక్షల ఇండ్లల్లో సర్వే నిర్వహించినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్తున్నారు. ఇదెలా సాధ్యమయ్యిందో వైద్యారోగ్య శాఖ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. స్వయంగా డీపీహెచ్ ఒకే రోజు డెంగ్యూ కేసుల సంఖ్య, టెస్టుల సంఖ్యపై రెండు రకాల గణాంకాలు విడుదల చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. ఈ నెల 24న డీపీహెచ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ నెల 21 నాటికి 66,589 డెంగ్యూ టెస్టులు చేశామని, 4,648 కేసులు నమోదయ్యాయని చెప్పగా, నమస్తే తెలంగాణకు ఇచ్చిన వివరణలో.. 23వ తేదీ నాటికి 63,532 మందికి టెస్టులు చేసి, 4,459 డెంగ్యూ కేసులు నమోదైనట్టు వెల్లడించారు. రెండు రోజుల్లో కేసులు, టెస్టుల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గినట్టు చెప్పారు. ఇదే తరహాలో జ్వర సర్వే లెక్కల్లోనూ స్పష్టత లేదని మండిపడుతున్నారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ఎంత? ఎంత మందిని సర్వే కోసం నియమించారు? ఒక్కో బృందం రోజుకు సగటున ఎన్ని కుటుంబాలను, ఎంత మంది వ్యక్తులను సర్వే చేసిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అలా కాకుండా.. పేపర్‌పై ఇష్టం వచ్చినట్టు నంబర్లు వేసి రిలీజ్ చేస్తే ఎలా? అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

కరువు ఆకలికి వన్యప్రాణులు బలి

- **నమీబియాలో 723 జంతువుల వధకు నిర్ణయం**
- **వాటి మాంసాన్ని ప్రజలకు పంచనున్న ప్రభుత్వం**

విండ్‌హోక్, ఆగస్టు 27: కరువు కోరల్లో చిక్కుకొన్న ప్రజల కడుపు నింపేందుకు 723 వన్య ప్రాణులను వధించాలని నమీబియా సర్కారు నిర్ణయించింది. పరిమితికి ఉంచి ఉన్న వన్యప్రాణులను చంపడానికి నిర్ణయించినట్టు ఆ దేశ పర్యావరణ శాఖ సోమవారం తెలిపింది. తీవ్రమైన కరువు కారణంగా గత నెలలో నమీబియా ఆహార నిల్వల్లో 84 శాతం కరిగిపోయాయి. రానున్న నెలల్లో దేశంలో సగం జనాభా తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో 83 ఏనుగలను వధించి వాటి మాంసాన్ని కరువు ఉపశమన కార్యక్రమంలో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితోపాటు నీటి గుర్రాలు, గేదెలు, జింకలు, బ్లూ వైల్డ్ బీస్ట్ జింకలు, అడవి గాడిదలను చంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

భూపాలపల్లిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

సింగరేణిలో మళ్లీ ఎన్నికలు జరపాలి

- **కార్మికులకు లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలి**
- **టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘాన్ని ఎన్నుకోవడానికి రూపొందించిన నిబంధనల ప్రకారం మళ్లీ ఎన్నికలను నిర్వహించాల్సిందేనని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మిర్యాల రాజిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, సింగరేణిలోని 11 డివిజన్లకు చెందిన యూనియన్ ఉపాధ్యక్షులు, కేంద్ర కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన తర్వాత 45 రోజుల్లోగా గెలిచిన సంఘానికి అధికారిక గుర్తింపు పత్రం జారీ చేయాలని, లేకుంటే గతంలో గెలిచిన సంఘంతోనే సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి వార్షిక లాభాలను తక్షణమే ప్రకటించాలని, లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశామని, లాభాల్లో వాటాను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.

డెంగ్యూ కట్టడిలో మీరు విఫలం!

వైద్యశాఖ అధికారులపై సీఎం, మంత్రి ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డెంగ్యూ కట్టడిలో వైద్యారోగ్య శాఖ విఫలమైందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా వైద్యశాఖ ఉన్నతాధికారుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తుగా కార్యాచరణ రూపొందించుకొని ఎందుకు అమలు చేయలేకపోయారని రేవంత్‌రెడ్డితో పాటు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వేలాదిగా కేసులు నమోదవుతుండటం, విషజ్వరాలు ప్రబలుతున్నా వైద్యసిబ్బందిలో ఇంకా అలసత్వం కనిపిస్తున్నదని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇకపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్టు తెలుస్తున్నది. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టలేకపోయిన పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలపైనా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. కనీసం ఫాగింగ్ కూడా చేయకపోవడం ఏమిటని మండిపడినట్టు తెలిసింది. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, ముందస్తు ప్రణాళిక అమలు చేయకపోవడం వల్లే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

డెంగ్యూ కట్టడికి స్పెషల్ డ్రైవ్

డెంగ్యూ కట్టడికి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడిపై సచివాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడుతూ డెంగ్యూ కట్టడిపై రాష్ట్రస్థాయిలో డీపీహెచ్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి డీపీహెచ్ రవీందర్ నాయక్ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

రిజిస్ట్రేషన్ల శాఖలో డీపీసీ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతులకు సంబంధించి మంగళవారం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని (డీపీసీ) నియమించారు. ఈ మేరకు శాఖ ముఖ్య కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సీఐజీ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, ఎక్సైజ్ శాఖ కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-1కు పదోన్నతి పొందే అర్హుతల జాబితాను తయారు చేయనున్నారు.

విషజ్వరాలతో ఇద్దరి మృతి

లచ్చిరాం (ఫైల్)

అర్జున్ (ఫైల్)

తొర్రూరు/నర్సంపేట, ఆగస్టు 27: విషజ్వరాలతో ఇద్దరు మరణించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని వెంకటాపురం గ్రామ శివారు కేవ్లాతండాలో బానోత్ లచ్చిరాం(54) కొన్ని రోజులుగా తరచూ జ్వరం బారిన పడుతున్నాడు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కాగా వరంగల్ జిల్లా నర్సంపేటలో సంకినేని అర్జున్ (17) కొద్ది రోజుల క్రితం జ్వరం వచ్చింది. రోజురోజుకు జ్వర తీవ్రత పెరిగిపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు.

తూనికలు, కొలతలపై తనిఖీలు ముమ్మరం

నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాఆద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తూనికలు, కొలతలపై తనిఖీలను ముమ్మరం చేయాలని, అవకతవకలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈవోడీబీ(ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చట్టం పేరుతో వినియోగదారుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో జరిగిన తూనికలు, కొలతల శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తూనికలు, కొలతల శాఖపై వినియోగదారుల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. పెట్రోల్‌బంక్‌లతో పాటు వేయింగ్ మిషన్లపై నిఘా పెంచాలని చెప్పారు. తూనికలు కొలతల శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ హన్, సహాయ కార్యదర్శి ప్రియాంక, అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ తోపాటు అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

తెలంగాణకు ఏటా 200 మెగావాట్ల విద్యుత్తు

- **ఎన్‌ఎల్‌సీతో రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ చేసుకోవాలి: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) నుంచి తెలంగాణకు ఏటా 200 మెగావాట్ల సౌరవిద్యుత్తు అందనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) పథకంలో భాగంగా ఎన్‌ఎల్‌సీ 510 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని కచ్ జిల్లా బిబర్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.1,214 కోట్లు అని, 2025 జూన్ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో నుంచి ఏటా తెలంగాణకు 200 మెగావాట్లు సరఫరా చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.2.57 కే కిలోవాట్ అవర్ విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తద్వారా రాబోయే 25 ఏండ్లలో ట్రాన్స్ కోకు రూ.2 వేల కోట్లు ఆదా అవుతుందని వెల్లడించారు. ప్రాజెక్టుకు సోలార్ ప్యానెళ్లతో పాటు సంబంధిత పరికరాలను తెలంగాణ మార్కెట్ నుంచే కొంటారని చెప్పారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్‌ఎల్‌సీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకోవాలని సూచించారు.